

# వంజరిత

పి.వి.డి.యస్
ప్రకాష్

**దాదాపు** రెండు సంవత్సరాల క్రితం తెరకు పరిచయమైన వినీల కొత్తగా తోటకు వసంతం వచ్చినట్లు గుబాళించసాగింది.

అయితే, ఆమెను నటిగా ఏ నిర్మాతా స్వీక రించలేదు. కేవలం నాట్యతారగానే తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకొంటూ అభివృద్ధి పథంలో పయనించసాగింది.

ఏ సినిమాపత్రిక తిరగవేసినా వినీల చిత్ర లో, పరిచయాలో కనిపిస్తూ ఉండేవి.

శ్రీధర్ తన పత్రికలో ఒక ఆర్టికల్ ప్రచురించ డంకోసం వినీల దగ్గరకు వెళ్ళాడు.

అప్పుడు వినీల ఒక స్టూడియోలో ఉంది.

జనరంజని క్రియేషన్స్‌వారు తమ చిత్రం కొరకు పాటని చిత్రీకరిస్తున్నారు వినీల మీద.

జలపాతంలా హోరుమంటూ అక్కడి వారిని ముంచేస్తోంది సంగీతం.

కెమెరా వినీల అందాల్ని దోచుకొని తనలో దాచుకొంటోంది.

పాట కనుగుణంగా వినీల పాదాలు నర్తించసాగా యి.

"కట్!" అన్నారు దర్శకుడు.

కొద్ది నిమిషాలు విశ్రాంతి దొరికింది వినీలకు. కర్చీఫ్‌తో ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుం టూ వచ్చి కూర్చుంది వినీల ఒక కుర్చీలో.

శ్రీధర్ తనని తాను పరిచయం చేసుకొన్నాడు జర్నలిస్టుగా.

అద్దంలో చూసుకుంటూ ఇంటర్వ్యూలో పాల్గొం ది వినీల.

పెన్, నోట్ బుక్ తీసి రాసుకుంటున్నాడు శ్రీధర్. "మీరు చిత్రాల్లో నటించకపోతే ఏ వృత్తిని స్వీకరించేవారు?" శ్రీధర్ అడిగాడు.

"డాక్టర్నవాలనుకొని యాక్టర్నయాను." నవ్వు తూ అంది వినీల.

"చిత్రాలలో నటించాలనే ఉద్దేశం ఎలా కలి గింది మీకు?"

"చిన్నతనంలో కాన్వెంట్‌లో చదువుకొంటున్న పుడు డాడీతో సినిమాలు చూసేదాన్ని. ఆ సమయంలో వారిలా నటించాలన్న తపన, తాప త్రయం ప్రేరణగా రూపొంది చివరి కిలా నాట్యతా రగా మారాను."

శ్రీధర్ వళ్ళు మండిపోయింది. వినీల సమాధా న మిస్తుంటే ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసిన శ్రీధర్ కెందుకో నమ్మ బుద్ధికాలేదు. ఎందుకోగాని, ఈ అమ్మాయి అబద్ధం చెబుతోం దనిపించిం దతనికి.

నిజానికి, ఆమె కళ్ళుకూడా చెమ్మగిల్లాయేమో మరి—తల దించుకొంది ఆ సమాధానం చెప్పి.

"ఫిల్మ్ జర్నలిస్టులు తారల నడిగే ప్రశ్నలు విద్యార్థి మేథను పరీక్షించే ప్రశ్నాపత్రాలు కావు-సమాధానాలన్నీ ఒకేరకంగా ఉండడానికి. వారి వారి వ్యక్తిత్వంబట్టి మారుతూ ఉండొచ్చు. కాని, అదేం కనబడడం లేదీనాడు.' అనుకొన్నాడు శ్రీధర్.

సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయా డక్కణ్ణుంచి.

ఆ తర్వాత వారంలోనే వినీలతో ఇంటర్వ్యూ సారాంశం-'మనసులేని బొమ్మలు-తారలు' అన్న శీర్షికతో ప్రారంభమైంది. అందులో తారల వైఖరిని తీవ్రంగా విమర్శించాడు శ్రీధర్.

"సినీ తార లందరూ షోకేసులో బొమ్మల్లాంటి వారు. కేవలం అందానికి ప్రతీకగా నిలబడడమే కాని వారికి ఒక అభిప్రాయమంటూ ఉండదు. తెరపై నటించడమే కాదు. నిజజీవితంలో కూడా వారు నటిస్తారు—గ్లామరు నిలబెట్టుకోవడంకె నం" అంటూ చిత్రంగా మొదలుపెట్టిన ఆ వ్యాసం గొప్ప సంచలనాన్నే సృష్టించింది.

చివరలో-"మరి కొంతమంది తారలు జర్నలి స్టుల ప్రశ్నలకు సమాధానాలే ఇవ్వరు. అంతా వారి తల్లులో, సోదరులో చూసుకొంటారు. 'మీ కే పూలంటే ఇష్టం', 'మీ భవిష్య త్తెలాగ ఉండా లనుకొంటున్నారు?' అన్న వ్యక్తిగత ప్రశ్నకు కూడా వారి గార్డియన్లే సమాధానా లివ్వడం శోచనీయం. అయితే, వ్యాపారపరంగా కూడా ప్రేక్షకుల బల హీనతలను కనిపెట్టి తెరపై తారల నటననే కాకుండా వారి వ్యక్తిగత జీవితాలను ఆధారం చేసుకొని వ్యాసాలు రాయడ మనేది ఈ నాడు అభివృద్ధి చెందింది. దాంతో వారు ఏ దేవలోకానికి చెందిన వారుగానో పరిగణింపబడుతున్నారు" అంటూ ముగించాడు.

ఆ వ్యాసం వెలుగులోకి వచ్చిన తరువాత ఒక రిద్దరు దర్శకులు. నిర్మాతలు శ్రీధర్‌ని వ్యంగ్యంగా ప్రశ్నించారు. దానికి శ్రీధర్ ఒకటే సమాధాన మిచ్చాడు-"చూడండి! పాఠకులు. ప్రేక్షకులు అమాయకులు. తెరపై చూసిందే నిజమనుకొంటారు. తారలను దేవతలుగా కొలుస్తారు. వారి జీవితాలు రోజా పాన్పులు కావని. వారినీ కొన్ని సమస్యలు వేధిస్తున్నాయని తెలుసుకోరు. కారణం వారిని కప్పిన గ్లామర్ తెర. ఆ తరువాత భాష సరిగ్గా రాని కొందరు మన నటులు. నటీమణులు చెప్పిన వాటిని జర్నలిస్టులే కదా హృద్యంగా రాసి మరి కొంత గ్లామర్‌ని పెంచుతారు. అది సరికాదని నా అభిప్రాయం."

×× ×× ××

శ్రీధర్ ఇంటికి వచ్చేసరికి వినీల ఫోన్ చేసిందని చెప్పింది తల్లి.

శ్రీధర్ వెళ్ళాడు వినీల ఇంటికి.

నవ్వుతూ పలకరించింది వినీల-"రండి" అంటూ.

శుభ్రమైన ధవళ వస్త్రాలతో మోహనంగా ఉందామె. ఆమె పక్కన ముగ్గురు ఆడవారు కూర్చున్నారు. అంతకుముందు వారినెక్కడా కలుసుకోలేదు.

"ఫరవాలేదు... రండి. ఆదర్శ మహిళా మండలి సభ్యులు వీరు. నాతో మాట్లాడుదామని వచ్చారు" అంది వినీల.

శ్రీధర్ వచ్చి పక్కనే సోఫాలో కూర్చున్నాడు. టీపాయి మీద శ్రీధర్ వ్రాసిన వ్యాసం పడిన మాగజైను ఉంది.

"ఇవాళ మీకు షూటింగు లేదా?" అడిగాడు శ్రీధర్.

తల అడ్డంగా ఊపింది వినీల. లేదన్నట్లు.

"వీరు సుధా రామన్‌గారని—ఆ సంస్థ అధ్యక్షులు. ఈవిడ మిస్ ప్రేమకుమారి కార్యదర్శి. ఈవిడ సునీతా పట్నాయక్ కాలేజీ విద్యార్థిని." పరిచయం చేసింది శ్రీధర్‌కి వినీల.

"మీ రేమనుకోకపోతే స్నేహపూర్వకంగా కొన్ని ప్రశ్నలు అడుగుతాం. సమాధాన మిస్తారా?" అడిగింది సుధారామన్.

"అడగండి" అంది వినీల.

ఆవిడ ప్రేమకుమారి వేపు చూసింది. ఆవిడ చేతిలో ఒక ఫైలుంది. అది వినీల చేతి కిచ్చిందావిడ. తిరగేస్తోంది పేజీలను ఒకటొకటిగా వినీల.

శ్రీధర్‌కూడా వాటిని చూస్తున్నాడు. అవన్నీ వినీల సినీ నాట్యాలలో ప్రదర్శించబడిన అర్థ నగ్న భంగిమలే. వినీల ముఖంలో రంగులు మారాయి.

అయినా. బలవంతాన కోపం అణచుకుంటున్నట్లు గ్రహించాడు శ్రీధర్.

చివరలో వినీల ఇచ్చిన వ్యాపార ప్రకటనలు కొన్నున్నాయి. బట్టల సబ్బుకి. చుట్టల కంపెనీకి. అగ్గిపెట్టెలకి వినీల ప్రచారం చేస్తున్న ఫోటోలున్నాయి.

అన్నింటికీ ఒకటే భాష—"సుప్రసిద్ధ నాట్యతార మెచ్చినవి."

ఫైలు మూస్తూ అంది వినీల. "చెప్పండి!"

"వినీలగారూ! మీది సాధారణమైన అందం గాదు. ఆడవారిని సైతం క్రీగంటితో సమ్మోహన పరుస్తారు. అంతటి మహత్తరశక్తి మీలో ఉంది కాని. ఇలా వినియోగపడడం భావ్యం కాదు" అంది ప్రేమకుమారి.

వెంటనే అందుకుంది సునీతా పట్నాయక్—"చూడండి! ఎన్నో మహిళా సంఘాలు పోషిస్తున్నాయి... ఈ పురుష ప్రపంచంలో ఆడవారికి సమాన స్థాయి కావాలని. వారికి న్యాయం జరగాలని. వ్యక్తిత్వం ఉన్న దానిగా పోరాడుతున్న నేటి స్త్రీకి మీ లాంటి వాళ్ళే తిరిగి శృంఖలాలను బిగిస్తున్నారు. కీలుబొమ్మలుగా చేస్తున్నారు. ఇది న్యాయమా?"


"మీకు తెలుసో. తెలియకో నిన్ననే విడుదలయిన మీ పిక్చరు ఎటువంటి పరిణామాన్ని సృష్టించిందో? ఇవాళ్టి పేపరులో ఉంది. హైదరాబాదులోని ఒక థియేటర్లో టికెట్ల కోసం తొక్కిసలాటలో మరణించాడో బాబు. అతని వయసెంతో తెలుసా? నిండా పన్నెండేళ్ళు లేవు" అంది సుధా రామన్.

అప్పటికి నోరు విప్పింది వినీల."అది నా వల్ల జరిగిందా? ఆ మరణానికి కారణం నేనా?"

నవ్వింది ప్రేమకుమారి. "చూడండి! చిత్ర విజయానికి కారణం సమిష్టి కృషి అనే మీ కళాకారుల మాటలు మాకు గుర్తే! కాని. వినీల ఎన్నో రీలుతో వస్తుందని ప్రశ్నించే డిస్ట్రిబ్యూటర్లు. వినీల అందంతో కనువిందు చేసుకుంటూ పెడదారులు పడుతున్న యువతా... ఇదంతా ఏమిటంటా

MCA-MCS-52-TEL






రు? ఒక ఆడది రాజ్యాలను నిర్మించింది. రాజ్యాల పతనానికి కారణ భూతమైంది. అదే స్త్రీ ఒక చిత్ర విజయానికి కారణభూతమౌతోంది. వినీల లాంటి కొందరు ధనాశతో వ్యక్తిత్వాన్ని చంపుకొని స్త్రీని నైచ్యంగా చిత్రీకరించే పురుషాహంకారానికి లొంగి పోతుంటే చూడలేక విలపించే మహిళలు ఏం చేయాలి?"

ప్రేమకుమారి వైపు ప్రశంసాపాత్రంగా చూశాడు శ్రీధర్. నిజమే! అనిపించిం దతనికి.

వినీల ఏమీ సమాధానం చెప్పలేదు. ముభావంగా కూర్చుంది. కాని, ఆమె ముఖ కవళికలను పరిశీలనగా చూస్తే ఆమెలో ఏదో తీవ్రమైన భావ సంచలనం కలుగుతూందని ఊహించవచ్చు.

సునీతా పట్నాయక్ అంది: "వినీలగారూ! మిమ్మల్ని నటించవద్దని మే మనడం లేదు. స్త్రీ ఔన్నత్యాన్ని గ్రహించమంటున్నాం. నేటి సినిమాలలో స్త్రీల పాత్రలు మేధావులకు సైతం ఒక పజిల్‌లా తయారవుతున్నాయి. స్త్రీ కీలుబొమ్మ కాకూడదు. వ్యక్తిత్వం ఉన్న మనిషి. హీరో తాగివస్తే అతన్ని ఖుషామత్ చేసి ఆడి పాడే కేబరే డాన్సర్ కాదు స్త్రీ."

"మిమ్మల్ని బాధ పెడితే క్షమించండి. ఇక సెలవు తీసుకుంటాం" అంది సుధారామన్.

ఆ గదిలో శ్రీధర్, వినీల ఇద్దరే మిగిలారు.

"ఫోన్ చేశారుట!" అడిగాడు శ్రీధర్ అప్పటికి.

"శ్రీధర్‌గారూ! మిమ్మల్ని ఏదో అనాలని పిలిచాను. ఆ వ్యాసం చదివాను. నా మనసంతా పాడయింది. కాని, ఇంతలో వీరు..." ఇక పై మాట్లాడలేకపోయింది వినీల. ఆమె కళ్ళలో నీటి తెర.

** ** **

"మీరు ఈ పరిశ్రమలోకి ఎలా ప్రవేశించారు?" అడిగాడు శ్రీధర్, ఒకనాటి సాయంకాలం బీచి దగ్గర ఇసుక తిన్నెల మీద కూర్చున్నాక.

"విధి" అంది వినీల.

"అది కాదు. చెప్పాలి" అన్నాడు శ్రీధర్.

"శ్రీధర్‌గారూ! తారలు ఉన్నతులా?" అడిగింది వినీల.

"ఏం అలా అడిగారు?"

"చిత్రాలలో పైకి వచ్చి కొంత పేరు వచ్చేనాటికే పతనానికి చేరువలో ఉంటారు వీరు. ఇందులో ఆడవారి జీవితాలు మరీ విచిత్రం. డబ్బు, దర్జా, కారులు, మేడలు... ఇవే ఉంటాయి వారికి ఓదార్పుగా, కన్నీటి తుడుపుగా. కాని, వాటిని చూసి సంతృప్తి కలుగదు వీరికి. ఆ నాటికి ఒక భర్త కావాలని, అతడి ఒక్కడికే శరీరం అర్పించడంలోని ఆనందం దొరకాలని ఆకాంక్షిస్తుంది మనసు. అది... అది... నెరవేరని కోరికే."

శ్రీధర్ చిత్రంగా చూస్తున్నాడు వినీల వంక. ఆమెలో కొత్త వ్యక్తి కనిపిస్తోం దతనికి.

"ఈ మధ్య మా ఊరు వెళ్ళాను, ఏదో పాట చిత్రీకరణ కోసం. అది పల్లెటూరయినా ఎంతో అందమైనది. చుట్టూ ఎత్తయిన కొండ, సముద్రం, కొంత దూరానికి వెడితే ఎర్రమట్టి దిబ్బలు..." మోకాలిపై తల ఆన్చి తన్మయంగా చెబుతోంది వినీల.

"ఏ ఊరు మీది?"

"భీమ్లి!"

"అవును! చాలా అందమైన ప్రదేశం" అన్నాడు శ్రీధర్.

"కాని, నన్ను చూడాలని వచ్చే అభిమానులను చూశాక నాకు విచిత్రమైన అనుభూతి కలగసాగింది. కారణం నేనూ ఒకప్పుడు అలాగనే వెర్రి వ్యామోహంతో చెమటలు కక్కుకుంటూ ఎండలో నిలబడేదాన్ని తారల దర్శనం కోసం. ఇప్పుడు ఇలా అందరి కళ్ళూ నా గురించి తహతహగా ఎదురు తెన్నులు చూస్తోంటే నా కనిపించిందొకటే—నా గొప్పతనం ఏ ముందని? నిర్లిప్తంగా ఉండిపోయాను."

శ్రీధర్ వింటున్నాడు మౌనంగా. ఆమెను ఏ విధమైన ప్రశ్నలు వేసి సాధించడం లేదు. ఎందుకంటే ఇన్నాళ్ళకు ఈ తళుకు తార తనలోని భావావేశాన్ని చూపిస్తోంది. ఇన్నాళ్ళకు ఈ నటి తన జీవితాన్ని, హృదయాన్ని విప్పి పరుస్తోంది.

అది చాలు! ఈ రోజు వినీలలోని అమాయక సౌందర్యం అతన్ని మత్తెక్కిస్తోంది కూడ.

"నా బాల్య స్నేహితురాలు మీనాకూడా ఎండ నపడి వచ్చింది నా దగ్గిరికి. ఆమెను గుర్తు పట్టలేకపోయాను. ఆమె శరీరం శుష్కించి పోయింది. వృద్ధాప్యం ఆమెతో చెలిమి చేసిం దప్పుడే! పెళ్ళయిందట. నలుగురు పిల్లలు. ఆరిందాతనం అలవడిం దామెలో. నన్నెంతో మెచ్చుకుంది. 'నిత్య యవ్వని' వంది. నాకు నవ్వొచ్చింది మారువ నైజం తలచుకొని. ఆమెకు నా జీవితం బాగుందిట. మరి, నాకో! ఆమెలా పవిత్రంగా ఒక మగాడికి భార్యగా ఉండాలని ఉంది. ఒక మనిషికే మనసూ, శరీరాన్నీ అర్పించి, ఒక వంశానికి వన్నె తెచ్చే ఆ స్త్రీ మూర్తిలోని పవిత్రత ఏది నాలో?"

"వినీలగారూ! మీ లో ఈ రోజు ఇంత పరితాపం రగులు కొంటోంది కదా? ఎందుకలా మొదటిసారి కెమెరా ముందు నిలబడ్డారు? మీరూ ఓ ఆకర్షణకు లోనయి వచ్చారు కదా!"

"నిజమే! నేనూ ఓ ఆకర్షణకు లోనయ్యాను. కాని, సినీమనిషి నవుదా మనుకుకోలేదు. ప్రేమించాను కళాధర్‌ని. కాని, ఈ కళకు అంకిత మయ్యాను. కళంకి నయ్యాను."

ఆమె చూపు గతంలోకి దూసుకుపోయింది.

** ** **

"వినూ!" పిలిచింది మీనా.

వినీల వెనక్కి తిరిగింది.

"అర్జంటుగా రావాలి." కళ్ళింతలు చేస్తూ పైట సవరించుకొంటూ పరుగు పరుగున వచ్చింది మీనా.

"ఎక్కడికి?" అడిగింది వినీల.

"షూటింగుకి?"

"ఎక్కడ?"

"ఎర్రమట్టి దిబ్బలు లేవూ, అక్కడ" మీనా సమాధాన మిచ్చింది.

వినీలకు వెళ్ళాలని ఉంది. కాని తండ్రేమంటారోనని భయంగా ఉంది.

ఈ సంగతి ఇట్టే పట్టేసిన మీనా అంది—"మీ నాన్నగారు గుడిలో ఉన్నారు లేవోయి."

"నేను రాను."

"చూడూ... కాత్యాయనీ దేవిలేదూ! అంత విగ్రహం తయారు చేశారుట సినిమావాళ్ళు. అయిదు గుర్రా లొచ్చాయి కూడా. నిర్మానుష్యంగా అడవి ప్రదేశంలా ఉండే ఆ చోటికి ఎంత కళ తెచ్చారనుకొన్నావు వాళ్ళు. ఓ గూడెం నిర్మిస్తున్నారట. చిన్న చిన్న ఇళ్ళుట."

వినీల కంతా అయోమయంగా ఉంది పాపం! ఆ పిల్ల మనసులో ఎన్నో ఊహలు. వాటిలో సినిమావాళ్ళు మనుషులు కాదు, దేవతలు—తలచుకుంటే ఏమయినా చేసెయ్యగలరు.

"నువ్వు వెళ్ళావా?" అడిగింది వినీల.

"లేదు. నీ నింకా వెళ్ళాలి. ఇప్పుడయితే అందరికీ ప్రవేశార్హత ఉంటుంది. ఇంకా నిర్మాణంలో ఉన్నాయి కొన్ని బొమ్మలు. తరవాత సినిమా తార లొచ్చాక ఇంత దగ్గరగా చూడలేం."

ఆ ఊరికి వినీల వచ్చి రెండు సంవత్సరాలు గడిచాయి. తల్లి పోయాక, తండ్రి ప్రశాంత వాతావరణం కోసం ఉన్న ఉద్యోగం వదలుకొని ఒక్కకూతురు తోనూ ఈ ఊరు వచ్చాడు. వేద శాస్త్రాధ్యయనంకూడా చేయడంతో కోవెల భారాన్ని ఇతని మీద వదలి పెట్టారు పురజనులు. తండ్రి దగ్గరికి వెళ్ళింది వినీల.

అరమూ త కనులతో దేవిని ధ్యానిస్తున్నా డతడు. దేవి పాదాల దగ్గర కుంకుమ రాసి పోసినట్లుగా ఉంది. గర్భగుడిలో దీపం వెలుతుర్లో ఆ

దేవి వింతయిన శోభతో అలరారుతోంది. తండ్రి ఒక్కడే ఉన్నాడు ఆ కోవెల్లో. మీనా తొందర పెడుతోంది వినీలను.

అంతే!

గబగబా పరుగు తీశా రిద్దరూ ఎర్రమట్టి దిబ్బల వేపు. ఎంతో మంది జనంతో నిండిపోయిందా ప్రదేశం. ఆరడుగుల ఎత్తయిన విగ్రహం తయారు చేశారు. ముందు ఒక మండపం తయారు చేస్తున్నారు. కళా దర్శకుడు తన ప్రతిభను చూపిస్తున్నాడు.

ఎందుకో తెలీదుకాని. ఆ విగ్రహాన్ని చూసిన వినీల కనులకు కోవెల్లోని కాత్యాయని విగ్రహం చూసినట్లే అనిపించింది.

"ఎలా ఉంది?" అడిగా డతడు. అతడికి గడ్డం ఉంది. యువకుడే.

అతన్ని చూడగానే తడబడింది వినీల. మీనా కోసం అటూ ఇటూ చూసిం దామె. మరో చోట ఉంది.

"బాగుందా?" మళ్ళీ అడిగాడు.

తలూపింది బాగుందన్నట్లు.

"నేనే చేశాను" అన్నా డతడు.

అతడి మీద గౌరవభావం మొలకెత్తింది వినీలకి.

"నీ పేరు చెప్పవా?"

"మీనా!" పిలిచింది వినీల.

"ఏయ్. మాట!" అతను వెనకనుంచి పిలుస్తున్నా వినకుండా మీనాతో కలిసి వెళ్ళిపోయింది వినీల.

******

ఆ రాత్రి వినీలకు నిద్ర పట్టలేదు. అతనే గుర్తుకొస్తున్నాడు మాటి మాటికి.

'నీ పేరు!' అడుగుతున్న ట్లనిపించిం దామెకు. అతని కంఠస్వరం మార్దవంగా ఉంది. వత్తయిన వంకీల జుట్టు. నల్లగా పెరిగిన గడ్డం. నిండయిన శరీర సౌష్టవం.

మరో రెండు రోజులు గడిచాయి.

ఆ ఉదయం లేవగానే తండ్రి అడిగిన మొదటి ప్రశ్న "ఏమ్మా? రాత్రల్లా నీపేరు నే నీవు కలవరిస్తున్నావు. ఏమయినా గాలి వాలలేదు కదా!"

ఏం మాట్లాడలేదు వినీల.

"నిన్న నాట్యం నేర్చుకోవడానికి వెళ్ళలేదుట. శాస్త్రి చెప్పాడు!" అడిగా డతను.

తప్పు చేసినట్లు తల దించుకొంది వినీల.

"చూడు. వినీలా! నువ్వు నాట్యం నేర్చుకోవాలి. మీ అమ్మ అంత దానివి కావాలి. ఇంకెప్పుడూ ఇలా మానివేయకు" అన్నా రతను.

అతని చెమర్చిన కనులను చూసి అనుకొంది వినీల- 'ఇంకెప్పుడూ నాట్యం విషయంలో అశ్రద్ధ చేయకూడదని.'

వినీలకు తండ్రిని చూస్తే గౌరవం. తల్లి తండ్రీ ఇద్దరూ ప్రేమించి పెళ్ళి చేసుకొన్నారు.

తండ్రి కోవెలకి వెళ్ళారు. వినీల కేం తోచలేదు. మీనా కోసం ఎదురు చూస్తూ నిలబడింది. ఆమె మనసులో అతని రూపమే మెదులుతోంది. నిజానికి. యుక్త వయసు వచ్చిన ఆడదాని అవసరాలను. ఆలోచనలనూ కనుక్కో గలిగేది కేవలం తల్లి. దురదృష్టవశాత్తు వినీలకు తల్లి ప్రేమ కరువైంది.

కోవెల్లోకి వచ్చింది వినీల. కాత్యాయనీ దేవి దర్శనమైంది. ఎవరూ లేరు. ఒక్క తండ్రి తప్ప.

అదేం చిత్రమో కాని. సినిమా సెట్టింగులోని దేవతా విగ్రహాన్ని చూడడానికి వేనవేల జన సందోహం తాపత్రయ పడుతోంది.

"వెడదామా?" మీనా రాకను గుర్తు పట్టి ఒక్క ఉదటున లేచి అడిగింది వినీల.

"నా కిప్పుడు తీరిక లేదు. అమ్మ కోప్పడు తుంది" అన్నది మీనా. వినీలలోని ఆత్రతని గ్రహించి.

అయిదు నిమిషాలు బతిమాలింది వినీల. దేవత వర మిచ్చినట్లు నవ్వి. "సరే" అంది గంభీరంగా.

******

ఎవరి కోసమో వినీల కళ్ళు వెదుకుతున్నాయి.

"అమ్మాయిగారేమిటి. ఈ వేళ ఏదో లోకంలో ఉన్నారు?" అడిగింది మీనా.

"ఏం లేదు. మీనా!" తడబడుతోంది వినీల.

"ఓహో! నాకు చెప్పకూడని రహస్యమా?" అలిగింది మీనా.

ఆమె భుజంమీద దెబ్బ చరచి అంది వినీల."నా ప్రియనేస్తా నివి నీవు. నీకు తెలియకుండా ఏం జరగదు సుమా!"

"వినీలా!" ఒక్కసారి బిగ్గరగా కేక వేసింది మీనా. మండపం దగ్గరి సాలభంజికను చూస్తూ.


"ఏమిటి?"

"చూ డిది!"

అంతే!



SAA/HSI/20 TEL




వినీల కూడా ఆశ్చర్యపోయింది. ఆ ప్రతిమ తనదా?ఆ కనులు, నా ిసిక, నవ్వుతున్నప్పుడు బుగ్గన పడే సొట్ట.

"చూశావా! ఇది ఎవరిదో?" మీనా.

"ఎవరిదో, ఏమో! ఎవరికి తెలుసు?" వినీల.

"ఓ పిచ్చిమొద్దూ! నే చూడలే దనుకొన్నావా మొన్న నీ పేరడిగిన వ్యక్తిని."

ిసిగ్గు పడిపోయింది వినీల, దొరికిన దొంగలా. ఆమె బుగ్గలు ఎరుపు రంగుకి తిరిగాయి.

"అతన్నే అడుగుతాను. ఎందు కలా చిత్రీకరించాడో?" అంది వినీల.

"అంత భాగ్యం కూడానా?" అన్నా డతడు వెనకనుంచి వస్తూ.

వినీల కనులు కిందకి వాలిపోయినాయి.

"నా పేరు కళాధర్. కళ కోసమే పుట్టాను. అందుకనే ఏమో నా కీ పేరు పెట్టారు మావాళ్ళు. రాత్రంతా నా కలలోకి వచ్చి ఆరడి పెట్టి అల్లరి చే ిసిన వారు మీరు. పేరు చెప్పరా?"

ఆ అడిగిన తీరుకి ముగ్ధురా లయింది వినీల.

"వినీల" నెమ్మదిగా చెప్పింది తన పేరుని వినీల.

"వినీల!" మంత్రాక్షరాలలా జపిస్తూ అన్నా డా మాటల్ని అతడు.

మీనా అడిగింది -"ఎప్పుడు షూటింగు మొదలవుతుంది?"

"ఇంకో వారం పడుతుంది. ఆ దేవి విగ్రహం మీ రిదివరకే చూశారు. ఈ మండపంలో హీరో హీరోయిన్ల ప్రేమగీతం తీస్తారు. పతాక సన్నివేశంకూడా ఇక్కడే. గుర్రాలమీద ఫైట్లు. మొత్తంమీద ిసినిమా సగానికి పైగా ఈ ప్రాంతమే!"

"అలాగా" అంటూ మీనా అక్కడ్నుంచి కదిలింది. ఒక్కటొక్కటిగా గూడెం గుడి సెల్ని తిలకిస్తూ. ఈ చిత్రనిర్మాణం కాదు కాని, భీమిలిలోని ఈ ప్రాంతానికి ఎన్నడూ లేని ఒక కళ వచ్చింది. వినీలకూడా కదలబోతుంటే కళాధర్ అడ్డొచ్చి, "మీనాయేనా నీ స్నేహితురాలు. నేనూ ఆప్తుణ్ణే!" అన్నాడు."వినీలా! ఎందు కిలా నన్ను ఇబ్బంది పెడతారు. మీ కిది న్యాయమా? నేను మీ కేం ద్రోహం చేశాను? అసలు ఈ ప్రాంతానికి రాకుండా ఉండవలి ిసింది. వచ్చాను. అమాయకమైన అడవి మల్లెలాంటి అందాన్ని తిలకించాను. కాని..." ఆ పై మాటలు అతని పెదవుల దగ్గరగ ఆగిపోయాయి!

వినీల అతన్ని తదేకంగా చూస్తోంది. ఏమని సమాధాన మివ్వాలో ఆమెకు తెలియలేదు. ఆమె ఒక సాలభంజిక మాదిరి నిలబడింది.

అత నన్నాడు- "మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. వినీలా!"

అంతే! వినీల గుండెలు దడదడా కొట్టుకోసాగయి.

ఆనందమో, ఆవేశమో తెలియ లే దామెకు.

******

"ఇంకా ఎన్నాళ్ళుంటారు మీరు?" అడిగింది వినీల, ఆ వెన్నెల్లో అతని ఒడిలో కరిగిపోతూ.

"ఇంకో పది రోజులు. ఆ తరవాత మళ్ళీ మద్రా ్స" అన్నాడు కళాధర్.ఆమె బుగ్గపై ముద్దిడుతూ.

వినీల మనసులో బెంగపడింది.

"మళ్ళీ ఎప్పు డొస్తారు?"

"చూడు.వినీలా! మళ్ళీ నేను రావడం ఎందుకు? నీవే రా నాతో మద్రాసుకు. ని న్నే ిసినిమాస్టారుని చేస్తాను" అన్నాడు కళాధర్.

"ఉహూ! నాకు తారగా మారాలని లేదు. మీ ఇంటికి ఇల్లాలిగా రావాలని ఉంది."

ఇప్పుడు వినీల. మీనాతో కూడా చెప్పకుండా వచ్చేస్తూంది. కళా దర్శకుడిగా అతని పని పూర్తయినా కేవలం ఈ పిల్ల కోసం కళాధర్ ఉండిపోయా డక్కడ. అది ఎంతో అపురూపంగా భావిస్తోంది వినీల.

అతనెన్నో మాటలు చెప్పా డామెకు- పెళ్ళి కాలేదని, పెద్ద బంగళా, కారుందని ఏవో...ఏవేవో...

ఆ తరవాత రెండో రోజు కాబోలు వినీల అక్కడికి వెళ్ళేసరికి ఆ ప్రదేశమంతా శ్మశానవాటికలా కనిపించింది.

పతాక సన్నివేశం చిత్రీకరణ సమయంలో జరిగిన యుద్ధంలో ఆ పెద్ద దేవీ విగ్రహంతో సహా ఎన్నో విగ్రహాలు విరిగిపోయాయి.

విలన్ ముఠావాళ్ళు కొత్తగా నిర్మితమైన ఆ గుడి సెలను కాల్చేశారు. విరిగిపోయిన బొమ్మలలో కళాధర్ నేర్పరితనమైన వినీల ప్రతిమకూడా ఉంది.

కాలిపోయిన ఇంటిని చూ ిసి జాలి పడింది వినీల. ఆమె గుండెలో అలాగే అగ్ని ప్రజ్వరిల్లుతోంది. ఆమె కళ్ళ ముందు కలల గూడు కాలిపోయి నట్లనిపించింది.

'కళాధర్ ఎంత మోసగాడు. ఆడతనాన్ని అందంగా దోచుకున్నాడు.' వినీల శిలాప్రతిమే అయింది.

******

"ఊరుకో. ఏం చేస్తాం? మాయదారి మగవాళ్ళను పుట్టించాడు ఆ దేవుడు- ఆడవాళ్ళను బలి తీసుకోమని. పులీ-మేకా జూదం ప్రకృతిలో సహజమే! అయితే, తెలివి తేటలతో బతకాలి." మీనా ఓదార్చింది వినీలను.

కాని, వినీల సున్నితమైన మనసు గాయపడింది. ఆమెలో ఏదో క ిసి బయలుదేరింది. కళాధర్‌ని కలుసుకోవాలి. చడా మడా తిట్టాలి. ఇంకెప్పుడూ ఇలా ఆడవారిని లొంగ దీసుకోవద్దని బుద్ధి చెప్పాలి. తనపై ఎన్నో ఆశలు పెట్టుకొన్న తండ్రికి ఈ విషయం చెప్పగలదా? అందుకే చెప్పా చేయకుండా మద్రాసు మహానగరాన్ని చేరుకొంది వినీల- కళాధర్‌ని అన్వేషించడాని కన్నట్లు.

"అర్థం అయింది. ఇక చెప్పకండి. మీరు కష్టపడి కళాధర్ దగ్గరికి వెళ్ళారు. అతనికి పెళ్ళయింది. భార్య ఉంది. మిమ్మల్ని ఎరగనట్లు ప్రవర్తించాడు. అంతే! మీ రీ రంగానికి దాసోహమన్నారు. ఇంటికి తిరిగి వెళ్ళలేక. అవునా?" అడిగాడు శ్రీధర్.

అవునన్నట్లుగా తల ఊపింది వినీల చెంపలపై ధారగా కారిన కన్నీటిని తుడుచుకుంటూ.

చుట్టూ చీకటి ము ిసిరింది.

"లేవండి! ఇంటికి వెడదాం." లేవదీశాడు శ్రీధర్ బలవంతంగా ఆమెని.

కారు నడుపుతూ మధ్యలో అడిగింది వినీల- "అన్నట్లు మీకు పెళ్ళయిందా?"

"ఏం అలా అడిగారు" అడిగాడు శ్రీధర్.

ిసిగ్గుపడి పోయింది వినీల. అప్పుడు తోచింది శ్రీధర్‌కి. ఎంతయినా ఆమె ఆడపిల్ల. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

"లేదు. కాలేదు" అన్నాడు శ్రీధర్. ఆమె ఆ ప్రశ్నలో మరో అర్థం స్ఫురించింది అతనికి.

"మొన్న వెళ్ళినప్పుడు తెలి ిసింది నాన్న పోయారని. ఒంటరిగా నిలుచున్నా నిప్పుడు ఈ ప్రపంచంలో" అంది వినీల భావ గర్భితంగా.

శ్రీధర్ ఏం మాట్లాడలేదు. చిన్న నవ్వు నవ్వాడు.

"అప్పుడప్పుడూ కాస్త శాంతి లభిస్తూంటుంది ఈ వృత్తిలో. ఏ మాయా లు ఆడపిల్లగా అందుకోలేని ఆనందాలు, రాజసాలు అందుకొంటూ ఉంటాను." నవ్వింది వినీల మాట మారుస్తూ.

శ్రీధర్ తరచూ వినీల ఇంటికి వెడుతుంటాడు. ఒక్కొక్కసారి షూటింగునుంచి వినీల త్వరగా ఇల్లు చేరుకో గలిగితే శ్రీధర్ ఆఫీసుకి ఫోన్ చే సేది రమ్మని. లోకం అనుకుంటున్న బాంధవ్యం వారి మధ్య లేదు. శ్రీధర్‌కి వినీల పట్ల పూర్తి సానుభూతి ఉంది. వినీలకి శ్రీధర్ ఆత్మీయుడు. అతడు లేని సమయంలో ఏవో చెప్పాలని ఊహించుకోవడం.అతని ఎదురుగా ఏమీ చెప్పలేని నిస్సహాయ ిస్థితి ఎన్నో సార్లు అనుభవించింది వినీల.